క్లుప్తంగా

వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్న సమారాధన



గుడ్లవల్లేరు: డోకిపర్రు వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తుల తాకిడి అధికమైంది. భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థికసాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

ఓటరు సవరణకు స్పందన కరువు



కూచిపూడి(మొవ్వ): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు నిర్వహించే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమానికి తొలి రోజు శనివారం స్పందన కొరవడింది. గ్రామాల్లో మైకు ప్రచారం నిర్వహించకపోవడంతో ఈ కార్యక్రమం పోలింగ్ కేంద్ర అధికారులకు మాత్రమే పరిమితం కావటం గమనార్హం. మొవ్వ మండలంలో 21 గ్రామాల్లోని 54 పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 9, 10 తేదీల్లో ప్రత్యేక క్యాంపైన్ నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఆదేశాలు జారీ చేయడంతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వేచి ఉన్నా ఫలితం లేదు.

ఉపాధి వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలి



గుడ్లవల్లేరు: ఉపాధి హామీ పథకం కింద చేస్తున్న పనుల్లో కూలీలకు ఒక్కొక్కరికి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని సీపీఎం మండల నాయకుడు బి.వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో వడ్లమన్నాడు, కొండిపాలెం, నక్కలపాలెం, ఉలవలపూడిలో ఆందోళనకారులు నిరసన చేపట్టారు. పెరుగుతున్న నిత్యవసరాల ధరలను దృష్టిలో పెట్టుకుని 15 రకాల సరుకులను రాష్ట్ర ప్రభుత్వం రేషన్ ద్వారా తక్కువ ధరకు పంపిణీ చేయాలని శ్రీనివాసరావు కోరారు. వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి కె.యాకోబు, సభ్యుడు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకట గురుమూర్తికి ఎమ్మెల్యే అభినందన



పామర్రు: రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపికైన వీరంకి వెంకటగురుమూర్తిని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా శనివారం అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతికి గురుమూర్తి చేసిన సేవలకు ప్రతిఫలంగా ఈ పదవి వచ్చిందన్నారు. అభినందించిన వారిలో నాయకులు కె ప్రవీణ్‌చంద్ర, వీ గణేష్, వీరంకి వెంకటేశ్వరరావు, పరసా సుబ్రమణ్యం, పీ శేఖర్ తదితరులు ఉన్నారు.

ఉత్సవాలు విజయవంతం చేయాలి



ముదినేపల్లి రూరల్: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు గ్రామస్తులు సంపూర్ణ సహకారాలు అందించాలని ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి అన్నారు. సింగరాయపాలెం-చేవూరు పాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షిక షష్ఠి కల్యాణోత్సవాలు వచ్చే నెల 6 నుంచి 18 వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఇరు గ్రామాల ప్రజలతో ఆలయ ఆవరణలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ఉత్సవాలకు వచ్చే భక్తులకు స్వచ్ఛందంగా అన్నిరకాల సేవలందించేందుకు గ్రామస్తులు ముందుకు రావాలన్నారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షణ చేయాలన్నారు.

సంక్షేమం ఎక్కడ..?

- శిథిలావస్థకు చేరిన వసతి గృహాలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

అవి పేరుకే సంక్షేమ హాస్టళ్లు. వీటిలో ఎలాంటి వసతులు లేకుండా భయానకంగా మారాయి. పేదలు తమ పిల్లలను చదివించుకునేందుకు ప్రభుత్వ వసతి గృహాలను ఆశ్రయిస్తున్నారు. అయితే ఆ హాస్టళ్లలో వసతులు పూర్తిగా మృగ్యమైపోవడంతో విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.



శిథిలమైన కొతవరం ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్ భవనం (ఇన్‌సెట్‌లో) శ్లాబుకు పెచ్చులూడిన దృశ్యం

గుడ్లవల్లేరు: మండలంలోని కొతవరం బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఏ మాత్రం వసతులు లేకుండా పోయాయి. దశాబ్దాల నాటి భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఆ భవనంలో శ్లాబు పెచ్చులూడిపోయింది. వర్షం వస్తే విద్యార్థులు తల దాచుకునేందుకు ఇబ్బందులుపడుతున్నారు. హాస్టల్ భవనం శ్లాబు పెచ్చులు ఎక్కడ మీద పడతాయో తెలియక విద్యార్థులకు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ఉంటున్నారు.



విద్యార్థులు మూత్ర విసర్జనకు వెళ్లాలంటే ఈ తాత్కాలిక ఏర్పాట్లే దిక్కు

గత్యంతరం లేకనే..

37 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనంలో ఉండలేక కేవలం 17 మంది విద్యార్థులే వసతి పొందుతున్నారు. తమకున్న పేదరికానికి వేరే గత్యంతరం లేక ఈ హాస్టల్లో కొంతమంది చదువుకుంటున్నారు. తాగునీటి వసతి కూడా ఈ హాస్టల్‌లో లేకుండా పోయింది. ట్యాప్‌లు అంతంత మాత్రంగానే పని చేస్తున్నాయి. టాయిలెట్స్‌కు విద్యార్థులు వెళ్లేందుకు ఎలాంటి సౌకర్యం లేదు. విద్యార్థులకు రాత్రి పూట దోమల బెడద తప్పటం లేదు. ఈ బాధలు పడలేక కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు ఆ భవనంలో ఉంచేందుకు ఇష్ట పడక తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లి చదివించుకుంటున్నారు.

పిల్లలకు సరైన నీడ లేదు



చదువుకునేందుకు హాస్టల్లో పిల్లలకు సరైన నీడ లేకుండా పోయింది. ఆ భవనం శ్లాబు నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో విద్యార్థులు హాస్టల్లో ఉండాలంటే భయపడుతున్నారు. భవనానికి మరమ్మతులు కూడా చేయించటం లేదు.

– ఒట్టిప్రోలు వెంకటేశ్వరమ్మ, కొతవరం, గుడ్లవల్లేరు మండలం

విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం



హాస్టల్లో విద్యార్థుల సంఖ్య నానాటికీ తగ్గుముఖం పడుతుంది. ఆ హాస్టల్‌ను పట్టించుకునే నాథుడే లేడు. అధికారులు వచ్చి వెళ్లడమే తప్ప భవనానికి మరమ్మతులు చేయించిన దాఖలాలు లేవు. ఈ భవనాన్ని కూల్చేసి ఆ స్థానంలో కొత్త భవనాన్ని నిర్మిస్తే మంచిది.

– పామర్తి వెంకటేశ్వరరావు, కొతవరం, గుడ్లవల్లేరు మండలం

ఎవరూ పనులు చేయటం లేదు

హాస్టల్ భవనానికి మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యాయి. ఎంతోమంది కాంట్రాక్టర్లు వచ్చి వెళ్తున్నారు. అయితే ఎవరూ పనులు చేసేందుకు ముందుకు రావటం లేదు.

– కొండపల్లి వెంకటేశ్వరరావు, హాస్టల్ వార్డెన్, కొతవరం

సమస్యల వలయంలో హాస్టళ్లు





ముదినేపల్లిలో నీటి సౌకర్యం లేని బీసీ బాలుర హాస్టల్ మరుగుదొడ్లు, ఎస్సీ బాలికల హాస్టల్లో పిల్లర్ దుస్థితి



ముదినేపల్లి ఎస్సీ బాలికల హాస్టల్లో పెచ్చులూడుతున్న భవనం

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లిలోని సంక్షేమ హాస్టళ్లు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. స్థానిక బీసీ బాలుర హాస్టల్లో 65 మంది విద్యార్థులున్నారు. ఈ హాస్టల్లో పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ప్రతి ఏటా నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. అయితే వసతుల కల్పనలో అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో విద్యార్థులు ఆశించిన స్థాయికి చేరడం లేదు. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో పాటు నీటి సౌకర్యం కూడా లేదు. బయట నుంచి బకెట్లతో నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది.

అధ్వానం

ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్ పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ హాస్టల్లో కేవలం ఆరుగురు విద్యార్థినులు మాత్రమే వసతి పొందుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ప్రైవేటు డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల్లో అధిక సంఖ్యలో ఎస్సీ బాలికల విద్యార్థులున్నారు. అయినప్పటికీ ఈ హాస్టల్లో సౌకర్యాలు లేక అద్దెగదుల్లో ఉండాల్సి వస్తోంది. ఈ హాస్టల్లో ఇతర వసతుల గురించి చెప్పాల్సిన అవసరం లేదు.

చర్యలు శూన్యం

పై రెండు హాస్టళ్లలో భవనాల మరమ్మతులు, సదుపాయాల కోసం కొన్ని నెలల క్రితం సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు తయారుచేసి నివేదికలు పంపారు. ఇందుకు సంబంధించి ఇంతవరకు నిధులు విడుదల కాలేదు. ఈ విద్యాసంవత్సరంలోనైనా మరమ్మతులు చేపట్టి సౌకర్యాలు కల్పిస్తే వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో అందరికీ న్యాయం



గుడివాడ టౌన్: మండల న్యాయ సేవాధికార సంస్థ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయం అందజేస్తుందని జూనియర్ సివిల్ జడ్జి ఎం.సుధారాణి అన్నారు. స్థానిక లింగవరం రోడ్‌లోని ప్రభుత్వ బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహంలో శనివారం న్యాయ సేవా దినోత్సవం నిర్వహించారు. న్యాయవాదులు, పోలీస్ అధికారులు, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, విద్యార్థులు తొలుత ర్యాలీ నిర్వహించారు. గతంలో ప్రాథమిక హక్కులు, విధులు అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఏయే అంశాలకు ఉచిత న్యాయం అందుబాటులో ఉంది, అందుకు ఎవరు అర్హులు అనే అంశాలను వివరించారు. ఈ అంశాలు తెలియని తల్లిదండ్రులకు విద్యార్థులు చెప్పాలన్నారు. బాలికలకు ఏమైనా సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 15100కు ఫోన్ చేస్తే వెంటనే న్యాయ సంస్థ స్పందించి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అజయ్‌బాబు, వన్‌టౌన్ ఎస్‌ఐ గౌతమ్‌కుమార్, లోక్ అదాలత్ ప్యానల్ న్యాయవాదులు ఎండీ రఫీ, సీహెచ్. కుటుంబరావు, బాలకృష్ణ, శివరామకృష్ణ, సౌదామణి, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటీపీ చెప్పే నిబంధన ఉప సంహరించుకోవాలి

పామర్రు: ఆస్తుల రిజిస్ట్రేషన్ల సమయంలో ఉపయోగించే నాన్ జ్యుడిషియల్ స్టాంపులు కొనుగోలు చేయాలంటే కొనుగోలుదారు ఓటీపీ చెప్పాలనే ప్రభుత్వ ప్రతిపాదనను ఉప సంహరించుకోవాలని దస్తావేజు లేఖర్ల సంఘం పామర్రు శాఖ అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఓటీపీ చెప్పాలనే ప్రతిపాదనతో స్టాంపు వెండర్లకు పని భారం అవుతుందన్నారు. స్టాంపుల విక్రయం చేయాలంటే కంప్యూటర్, ప్రింటర్, స్కానర్, ఇంటర్‌నెట్ కనెక్షన్ తప్పనిసరి అవుతుందని పేర్కొన్నారు. కక్షిదారులు, వెండర్లను దృష్టిలో పెట్టుకుని పాత పద్ధతి అయిన రికార్డులలో నమోదు చేసుకునే విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలి

ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి శ్రీహరి



సదస్సులో మాట్లాడుతున్న ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి శ్రీహరి

పామర్రు(తోట్లవల్లూరు): ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీహరి పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా తోట్లవల్లూరు మండలం చాగంటిపాడులో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీహరి పాల్గొని మాట్లాడారు. రాజీ మార్గమే రాజ మార్గమన్నారు. కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. గతంలో గ్రామానికి చెందిన మర్రెడ్డి సుబ్బారెడ్డి, మర్రెడ్డి అనుచరులు కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించారు. ఆ తర్వాత వారికి సంతానంలేని కారణంగా వారి ఆస్తులకు సంబంధించి వారి వారసులకు, కౌలు దారుకు ఏర్పడిన వివాదం 2015 నుంచి ఉయ్యూరు జూనియన్ సివిల్ జడ్జి కోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. సదరు వివాదం 2024లో ఇరువర్గాల మధ్య లోక్ అదాలత్‌లో రాజీ కాబడి, గ్రామంలోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి చేయుటకు చనిపోయిన వారి వారసులు అంగీకరించారన్నారు. అనంతరం ఉయ్యూరు బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి గ్రామంలో మొక్కలను నాటారు

బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కేసులు



కైకలూరు: నిబంధనలకు విరుద్ధంగా బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కైకలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ రమేష్ హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మద్యం పాలసీని నియమ నిబంధనలతో అమలు చేస్తుందన్నారు. నియోజకవర్గంలో కైకలూరు మండలంలో 8, కలిదిండి మండలంలో 5, మండవల్లి మండలంలో 3, ముదినేపల్లి మండలంలో 5 వెరసి మొత్తం 21 మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారన్నారు. నాలుగు మండలాల్లో దాడులు చేసి బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న 14 మందిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. వీరి వద్ద నుంచి 91 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు.

తల్లి మందలించిందని ఇంట్లో నుంచి వెళ్లిపోయిన బాలిక

గుడివాడరూరల్: తల్లి మందలించిందని ఇంట్లో నుంచి ఓ బాలిక వెళ్లిపోయిన సంఘటన శనివారం జరిగింది. గుడివాడ తాలూకా పోలీసుల కథనం మేరకు మండలంలోని లింగవరం గ్రామానికి చెందిన వెంకటేష్ కుమార్తె నీరజ ఏలూరు ప్రభుత్వ పాఠశాల్లో 6వ తరగతి చదువుతోంది. తల్లి మందలించడంతో శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి కన్పించడం లేదు. బాలిక తల్లి నాగమల్లేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ చంటిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు ఎస్‌ఐ సెల్: 94407 96427, 08674 242143లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

ఆశాజనకంగా వరి సాగు



పామర్రులో కోతకు సిద్ధమవుతున్న వరి పైరు

పామర్రు: మండలంలో వరి సాగు ఆశాజనకంగా ఉంది. ఈ ఏడాది 23,500 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. సాగు ఆలస్యంగా ప్రారంభమైన చోట మాత్రం వారం, 10 రోజుల్లో ఆ పొలాలు కూడా పక్వానికి వస్తాయని రైతులు తెలిపారు. మండలంలోని బల్లిపర్రు, కురుమద్దాలి, కనుమూరు, పెదమద్దాలి, జమీగొల్వేపల్లి గ్రామాల్లోని వరి పక్వానికి వచ్చింది. వారంలో కోతలు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు.

అపరాల సాగుకు సిద్ధం

మండలంలోని కాలువ ఎగువ ఉన్న రైతులు ఇప్పటికే అపరాలు వెదజల్లుతున్నారు. మండలంలో సాగు నీటి కొరత లేక పోవడంతో దాళ్వా వరి సాగు ఉండే అవకాశం ఉంది. దీంతో కొందరు రైతులు దాళ్వా సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం త్వరగా ఏదో ఒక నిర్ణయం చెబితే దానికి అనుగుణంగా సాగుకు చెప్పట్టే అవకాశాలున్నాయని రైతులు చెబుతున్నారు. అపరాల సాగుకు అవసరమైన మినుము విత్తనాలను ప్రభుత్వం సత్వరమే అందజేయాలని రైతులు కోరుతున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం



కైకలూరు టౌన్‌హాలు వద్ద పిచ్చిమొక్కలు పెరిగి పూడుకుపోయిన డ్రైయిన్



టౌన్‌హాలు వద్దకు వచ్చిన డ్రైయిన్‌లోను మురుగు నీరు

కైకలూరు: కూటమి ప్రభుత్వంలో పారిశుద్ధ్యం పడకేసింది. చినుకు పడితే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. డ్రెయిన్ల పరిస్థితి దారుణంగా మారుతోంది. కైకలూరు పంచాయతీలో పలు డ్రెయిన్ల పూడుకుపోయాయి. జాతీయ రహదారి సమీపంలోని టౌన్‌హాల్ వద్ద డ్రెయిన్ పచ్చటి నీటి కొలనుగా మారింది. నీటి పారుదల లేక టౌన్‌హాల్లోకి మురుగు నీరు చేరుతోంది. పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

■ వేర్ హౌసింగ్ కమిటీ చైర్మన్‌గా రావి వెంకటేశ్వరరావు

గుడివాడరూరల్: రాష్ట్ర వేర్ హౌసింగ్ కమిటీ చైర్మన్‌గా గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావును కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో భాగంగా శనివారం నియమించింది. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఎయిర్‌పోర్టు కమిటీ సభ్యుడు కామేపల్లి తులసీబాబు రావికి శుభాకాంక్షలు తెలిపారు.

■ ముగిసిన ఆన్‌లైన్ రిఫ్రెషర్ ప్రోగ్రామ్

గుడ్లవల్లేరు: అఖిల భారత అధ్యాపకుల సంఘం ఏపీ శాఖ అనుసంధానంతో గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ కళాశాల వారి ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ రిఫ్రెషర్ ప్రోగ్రామ్ శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి రీసోర్స్ పర్సన్స్‌గా జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ డాక్టర్ డి.వినయ్‌కుమార్, బాపట్ల ఫార్మశీ ప్రొఫెసర్ డాక్టర్ వి.సాయికిషోర్, భీమవరం విష్ణు కాలేజీ ఆఫ్ ఫార్మశీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.మోహన్ వర్మ వ్యవహరించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణ రావు తెలిపారు.

■ ప్రభుత్వ పథకాలకు పోస్టల్ సేవలు

గుడివాడ టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లబ్ధిదారులకు పథకాలు అమలు చేయడంలో పోస్టల్ శాఖ సేవలందిస్తుందని డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ సీహెచ్. అప్పారావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలకు సంబంధించి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) ద్వారా పథకాల మొత్తాలు లబ్ధిదారుల ఖాతాలో వేసేందుకు పోస్టల్ సేవింగ్ ఖాతాలు తెరుచుకునేందుకు వీలు కల్పించిందని పేర్కొన్నారు. ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ ద్వారా నూతన ఖాతాలు తెరవనున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు దాటిన వారు ఈ ఖాతాలు ప్రారంభించేందుకు అర్హులన్నారు. ఈ నెల 15 వరకు ఖాతాలు తెరిచే అవకాశం ఉందన్నారు. వివరాలకు సమీపంలోని పోస్టాఫీస్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

■ నేడు ఉచిత వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు శనివారం లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇరుకు పోలీసుస్టేషన్‌తో అవస్థలు

మండవల్లి: మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ ఇరుగ్గా ఉండడంతో ఇక్కడకు వచ్చేవారు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. గతంలో పోలీసుస్టేషన్‌ను రోడ్డు విస్తరణలో కూల్చేశారు. నూతనంగా స్టేషన్ భవన నిర్మాణానికి ఎంపీపీ స్కూల్ వెనుక భాగంలో ఇరిగేషన్ స్థలంలో శంకుస్థాపన చేశారు. ఆ స్థలంలో పోలీసు స్టేషన్ భవన నిర్మాణం వీలు పడదని ఇటీవల ఇరిగేషన్ అధికారులు పోలీసు అధికారులకు తెలిపారు. దీంతో గత్యంతరం లేక గతంలో ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయంలో పోలీసుస్టేషన్‌ను కొనసాగిస్తున్నారు. మండవల్లి మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ స్టేషన్‌లో పోలీసు కేసులు కూడా ఎక్కువే. ప్రభుత్వం నూతనంగా పోలీసు స్టేషన్ భవనం నిర్మించి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రస్తుతం ఉన్న పోలీసుస్టేషన్



నూతన పోలీసు స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన స్థలం

స్టేషన్‌కు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది

గతంలో ఉన్న పంచాయతీ కార్యాలయంలోకి స్టేషన్ మార్చడంతో ఇరుకు గదులతో ఉన్న కారణంగా పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నూతన పోలీస్‌స్టేషన్ భవనం నిర్మించి ఇబ్బందులు తొలగించాలి.

వేరే చోట స్థలం చూపించాలి

ఇరిగేషన్ స్థలంలో పోలీస్ స్టేషన్ నిర్మాణం కుదరదని ఇరిగేషన్ అధికారులు చెప్పారు. ఈ కారణంగా వేరే చోట స్థలం చూసి పోలీస్ స్టేషన్ నిర్మాణం చేపట్టాలి.

–బి.గంగాధరరావు, స్టేషన్ రైటర్, మండవల్లి

ఇరుకు గదులతో ఇక్కట్లు

పోలీస్ స్టేషన్‌లో ఉండే స్థలం చాలక స్టేషన్‌కు వచ్చే వారు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇరుకు గదులు సిబ్బంది, స్టేషన్‌కు వచ్చే వారి సరిపోవడం లేదు. వాహనాలు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై పెట్టి స్టేషన్‌కు వెళుతున్నారు. దీంతో గ్రామస్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది.

–మన్నేపల్లి ఆదాం, మండవల్లి